క్లుప్తంగా

అమ్మవార్లకు వెండి ఆభరణాల వితరణ



వెండి కిరీటాలు, కుంకుమ భరణి

భోగాపురం: మండలంలోని పోలిపల్లిలో కొలువైన పైడితల్లి, బంగారమ్మ, పరదేశమ్మతల్లి అమ్మవార్లకు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రోతు నాయుడు కుటుంబ సభ్యులు సుమారు రూ.3.25 లక్షలు విలవ చేసే కుంకుమ భరణి, వెండి కిరీటాలతో పాటు ఏసీ మిషన్‌ను సోమవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా కర్రోతు నాయుడు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. అమ్మవార్లకు వెండి ఆభరణాలు వితరణగా అందజేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పిన్నింటి నరసింగరావు (చిన్న), ఏపీ సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవికి కుంకుమార్చన



మహాలక్ష్మీదేవికి పూజలు చేస్తున్న అర్చకుడు

డెంకాడ: మండల కేంద్రంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహాలక్ష్మి పుట్టిన రోజును పురస్కరించుకుని సోమవారం కుంకుమపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు



వ్రతాలు చేస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేట వీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణ వ్రతాలు సోమవారం నిర్వహించారు. వేకువజామున స్వామివారికి పంచామృతాభిషేకాలు చేపట్టి, వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో అలంకరించారు. సామూహికవ్రతాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం



నృత్యం చేస్తున్న చిన్నారులు

విజయనగరం టౌన్: విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీయడమే తమ లక్ష్యమని గాజులరేగ నారాయణ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు. పాఠశాల 21వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

28న తపాలా అదాలత్

విజయనగరం టౌన్: విజయనగరం పోస్టల్ డివిజన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించే నిమిత్తం ఈ నెల 28న ఉదయం 10 గంటలకు హెడ్ పోస్టాఫీస్‌లో తపాలా, పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు పోస్టల్ సూపరింటిండెంట్ వి.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదాలత్‌లో తపాలా సర్వీసులకు సంబంధించిన ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులు మాత్రమే చర్చిస్తామని పేర్కొన్నారు. డివిజన్‌లోని పోస్టల్ వినియోగదారులు తమ ఫిర్యాదులను ఈ నెల 27లోపు తపాలా,పెన్షన్ అదాలత్ శీర్షికతో హెడ్‌పోస్టాఫీస్ , విజయనగరం చిరునామాకు పంపించాలని కోరారు.

చేపలకంచేరులో అగ్ని ప్రమాదం

భోగాపురం: మండలంలోని చేపలకంచేరులో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో అరజర్ల ఎర్రన్నకు చెందిన సుమారు రెండెకరాల పొలంలో ఉన్న నీలగిరి తోట దగ్ధమైంది. స్థానికులు వెంటనే స్పందించి తగరపువలస అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

గంట్యాడ: మండలంలోని రావివలస గ్రామంలో మారుతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేదలకు సోమవారం బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ పేదలకు సహాయం అందించడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందన్నారు.

దాసన్నపేట వాసుల దాహం తీరింది..

- రూ. 1.10 కోట్లతో వాటర్ ట్యాంక్ ఏర్పాటు
- తాగునీటి కష్టాలు తీరడంతో సర్వత్రా హర్షాతిరేకాలు



దాసన్నపేట ప్రాంతంలో నిర్మించిన 800 కిలోలీటర్ల వాటర్ ట్యాంక్



తాగు నీటి కుళాయి వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు (ఫైల్)

విజయనగరం: నగరంలోని దాసన్నపేట వాసులు గత ఎన్నికల ముందు వరకు తాగునీటికి ఎన్నో ఇబ్బందులు పడ్డారు. తాగేందుకు నీరు లేక దూర ప్రాంతాలకు వెళ్లి మహిళలు బిందెలతో నీళ్లు తెచ్చుకునే పరిస్థితి ఉండేది. ఆ ప్రాంత ప్రజల ఓట్లతో గెలిచి పదవులు అనుభవించిన టీడీపీ నాయకులు తాగునీటి సమస్యను పట్టించుకోకపోగా.... కోలగట్ల వీరభద్రస్వామి మాత్రం సమస్య పరిష్కారానికి నడుంబిగించారు. ఈక్రమంలో వాటర్‌ట్యాంక్ నిర్మాణానికి ఎమ్మెల్సీ హోదాలో శంకుస్థాపన చేసిన కోలగట్ల వీరభద్రస్వామి అనంతర కాలంలో పనులు పూర్తి చేయించి దాసన్నపేట వాసుల దాహార్తి తీర్చి, ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ 6,7 డివిజన్‌ల పరిధిలో దాసన్నపేట, కాపు వీధి, సుద్దవీధి, నవాబ్‌పేట, తదితర ప్రాంతాలు ఉండగా... ఆ ప్రాంత ప్రజలు 2021 వరకు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడేవారు. నగర శివారు ప్రాంతం కావడం.. దశాబ్దాల కిందట వేసిన పైప్‌లైన్ల ద్వారా సక్రమంగా నీరు సరఫరా కాకపోవటంతో నీటి కష్టాలు చెప్పనలవిగా మారాయి. ఇదే ప్రాంతం నుంచి వార్డు మెంబర్‌గా గెలిచి అప్పట్లో మున్సిపల్ చైర్మన్‌లుగా పదవులు అనుభవించిన వారు సైతం తమ ప్రాంత వాసుల కష్టాలు పట్టించుకోకపోవడం శోచనీయం. టీడీపీ హయాంలో నిధులుండీ వాటిని సద్వినియోగం చేసుకోవడంలో పాలకులు నిర్లక్ష్యం వ్యవహరించారు. దీంతో దాసన్నపేటతో పాటు పలు ప్రాంతాల ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పలేదు.

2021లో సాకారమైన కల..

దశాబ్దాలుగా తాగునీటి కోసం కష్టాలు పడుతున్న దాసన్నపేటతో పాటు పరిసర ప్రాంత వాసుల కల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎట్టకేలకు సాకారమైంది. స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు అమృత్ పథకం ఫేజ్–2లో భాగంగా ఆ ప్రాంతంలో రూ.1.10 కోట్లతో 800 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ నిర్మించి మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. 2019 ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఆ ప్రాంత తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి 2021 నాటికి వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేయించారు. విశేషమేమిటంటే 2014 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో ఇదే కోలగట్ల వీరభద్రస్వామి వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించగా.. అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ట్యాంక్ నిర్మాణాన్ని పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే హోదాలో కోలగట్ల పనులు పూర్తి చేయించడం గమనార్హం.

మహానుభావుడు..

దాసన్నపేట ప్రాంత ప్రజల తాగునీటి కష్టాలు తీర్చిన మహానుభావుడు కోలగట్ల వీరభద్రస్వామి. సంవత్సరాల నుంచి నీటి కోసం అల్లాడుతుంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వాటర్ ట్యాంక్ నిర్మించి తాగునీటి కష్టాలు తీర్చారు. ప్రస్తుతం రోజు విడిచి రోజు తాగు నీరు వస్తోంది. అంతేకాకుండా మా ప్రాంతంలో రోడ్లు వేయించి పుణ్యం కట్టుకున్నారు.

– ఎస్. సావిత్రి, దాసన్నపేట, విజయనగరం.

వేడుకగా హోలీ పండుగ



విజయనగరం అర్బన్: సీతం ఇంజినీరింగ్ కళాశాలలో హోలీ సంబరాలు

విజయనగరం అర్బన్: సత్యా విద్యాసంస్థల్లో హోలీ పండుగను సోమవారం వేడుకగా జరుపుకున్నారు. స్థానిక గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాల గరల్స్ హాస్టల్‌లో విద్యార్థినులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. అంతకుముందు సంప్రదాయబద్ధంగా కట్టెలు, పిడకలు, దుంగలను పోగు చేసి తెల్లవారు ఝామునే మంటను వేసి హిరణ్యకశపుని చెల్లెలు హోళికా దహనంతో ఉత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, హాస్టల్ వార్డెన్ సత్యవేణి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు. అదే విధంగా తోటపాలెంలోని సత్యా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి ఆధ్వర్యంలో హోలీ పండుక వేడుకగా జరిగింది. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఉదయ్‌కిరణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భోగాపురం : రంగులతో యువతులు

ఘనంగా ..

భోగాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు హోలీ పండగను ఘనంగా నిర్వహించారు. చిన్నా,పెద్దా తారతమ్య లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు.

క్వారీలను నిలిపివేయాలి



కొత్తగా ఏర్పాటు చేయనున్న క్వారీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రామచంద్రపేట గ్రామస్తులు

భోగాపురం: గ్రామ సమీపంలో నడుపుతున్న క్వారీలను నిలిపివేయాలని రామచంద్రపేట గ్రామస్తులు కోరారు. ఈ మేరకు గ్రామ సమీపంలో ఉన్న క్వారీ వద్ద గ్రామస్తులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్వారీల్లో బాంబ్ బ్లాస్టింగ్‌లు చేయడం వల్ల ఇళ్లు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. అలాగే దుమ్ము, ధూళి వల్ల తాగునీటి వనరులు కలుషితమవుతున్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న క్వారీలతోనే ఇబ్బందులు పడుతుంటే మళ్లీ కొత్తగా జీఎంఆర్ సంస్థకు మరో క్వారీ మంజూరు చేసేందుకు ఉన్నతాధికారులు చూస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్వారీలను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు పెద్దలు దుక్క అప్పన్న, సుగ్గి రాము, కోలా రామసూరి, దుక్క రమణ, అప్పలకొండ, నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ర్యాలీ



మిమ్స్ ఉద్యోగుల ర్యాలీ

నెల్లిమర్ల: తమ సమస్యలు పరిష్కరించాలంటూ మిమ్స్ ఉద్యోగులు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. మిమ్స్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో అన్ని పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొని మద్దతు తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని 54 రోజులుగా పోరాటం చేస్తున్నా మిమ్స్ యాజమాన్యం, ప్రభుత్వ అధికారులు స్పందించకపోవడంతో అన్ని పార్టీలు, ప్రజల సహకారంతో స్థానిక మొయిద జంక్షన్ నుంచి రామతీర్థం జంక్షన్ మీదుగా మిమ్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. చంద్రంపేట, కొండగుంపాం, గరికిపేట వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రోతు వెంకటరమణ, పతివాడ అప్పారావు, పతివాడ రామునాయుడు, పతివాడ రమణ, వాల్లే అప్పలనాయుడు, గుంటమాని ఉమా, మహంతి పైడి నాయుడు, మజ్జి గణేష్, టిక్కలి సర్పంచ్ నేతేటి స్వామినాయుడు, సీపీఐ నాయకుడు మొయిద పాపారావు మద్దతు పలికి ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయడంతో పాటు సస్పెండ్ చేసిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. అలాగే న్యాయపరమైన ఇతర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కిల్లంపల్లి రామారావు, ఫేకర్ యూనియన్ నాయకుడు అంబళ్ల గౌరినాయుడు, మిమ్స్ ఉద్యోగులు ఎం.నారాయణ, కె. కామునాయుడు, కె. మధు, ఎం. నాగభూషణరావు, గౌరి, వరలక్ష్మి, బి.బంగారు నాయుడు, మూర్తి, ఎం.రాంబాబు, జి.శ్రీను, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే వారిని ప్రోత్సహించండి...

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- దాసన్నపేట ప్రాంతంలో ఎన్నికల ప్రచారం
- మంగళ హారతులిచ్చి ఆశీర్వదించిన ప్రజలు



ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రజలకు అందుబాటులో ఉన్న వారిని ఆదరించండి.. అభివృద్ధి చేసే వారిని ప్రోత్సహించండి.. నిరంతరం ప్రజాసేవ చేసే వారిని గెలిపించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. దాసన్నపేటలోని యాతవీధి, నాగవంశంవీధి, తదితర ప్రాంతాలలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. కోలగట్ల రాకతో ఆ ప్రాంతమంతా సందడి వాతావరణం నెలకొంది. నగరాన్ని అభివద్ధి చేసిన ప్రజా సేవకునికి మళ్లీ పట్టం కడతామని స్థానికులు చెప్పడంతో హర్షాతిరేకాలు మిన్నంటాయి. దారి పొడవున జనం నీరాజనాలు పలికారు. మహిళలు హారతులు ఇచ్చి విజయ తిలకం దిద్దారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ పొంతపల్లి మాలతి, జోనల్ ఇన్‌చార్జ్ బొద్దాన అప్పారావు మాట్లాడుతూ.. నగరంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో ఈ ఐదేళ్లలో జరిగిందన్నారు. పెద్ద పల్లెటూరుగా ఉన్న విజయనగరాన్ని కార్పొరేషన్ స్థాయికి తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. అధికారం చేపట్టినప్పటి నుంచి ఎన్నికలు వచ్చే వరకు నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకున్నారని కొనియాడారు. కరోనా కష్టకాలంలో ఆయన చేసిన సేవలు మరువలేనివని చెప్పారు. దాసన్నపేట ప్రజల దాహార్తి తీర్చిన అపర భగీరథుడన్నారు. ఓ వైపు మౌలిక సదుపాయాల కల్పన.. మరోవైపు నగరంలో అభివద్ధి పనులను చేపట్టి విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. ఆయన అందించిన సేవలు మరో ఐదేళ్ల పాటు కొనసాగాలంటే మరోసారి ఆయనను శాసనసభ్యుడిగా గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తే.. స్థానికంగా కోలగట్ల అభివృద్ధి పాలన అందించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివద్ధి మండలి డైరెక్టర్ బంగారునాయుడు, మన్యాల కృష్ణ, గదుల సత్యలత, కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి, జోనల్ ఇన్‌చార్జ్ బోడసింగి ఈశ్వరరావు, మాజీ కౌన్సిలర్ కోరాడ సూర్య ప్రభావతి, పొంతపల్లి గోపి, మజ్జి శ్రీను, ఆకుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బకాయి జీతాలు చెల్లించాలి



నిరసన తెలియజేస్తున్న పంపు ఆపరేటర్లు

- విజయనగరం కార్పొరేషన్ పంపు ఆపరేటర్లు

నెల్లిమర్ల: బకాయి జీతాలను వెంటనే చెల్లించాలని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ తాగునీటి పథకాల పంపు ఆపరేటర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో నెల్లిమర్ల మాస్టర్ పంప్‌హౌస్ వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్పొరేషన్ డీఈ, కాంట్రాక్టర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఎ. జగన్ మోహనరావు, మురళి, నారాయణరావు, పైడిరాజు మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు నిత్యం తాగునీరు సరఫరా చేసే నెల్లిమర్ల, రామతీర్థం, ముషిడిపల్లి పథకాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఆరు నెలలుగా జీతాలు చెల్లించలేదని వాపోయారు. అలాగే అమృత పథకం సిబ్బందికి 2022 మార్చి, ఏప్రిల్, సెప్టెంబర్ నెలల జీతాలు పెండింగ్ ఉన్నట్లు చెప్పారు. ఈ నెల 16వ తేదీన కమిషనర్ సమక్షంలో జరిగిన చర్చల్లో పెండింగ్ జీతాలు వెంటనే చెల్లిస్తామని కాంట్రాక్టర్, డీఈ హామీ ఇచ్చినా, ఇంతవరకు చెల్లించలేదన్నారు. వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు.

అయ్యప్ప జన్మదినోత్సవం

చీపురుపల్లి: అయ్యప్ప స్వామి జన్మదినోత్సవాన్ని స్థానిక శివరాం రోడ్‌లోని ధర్మశాస్త్ర మణికంఠ సన్నిదానంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. గురుస్వామి క్లాసిక్ రమణ నేతృత్వంలో ఉదయం 9 గంటల నుంచి అయ్యప్పస్వామికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సన్నిదానం ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. సన్నిదానం సభ్యులు, బి.జి.పాలెం సర్పంచ్ రమణ, కెల్ల గోపి, సన్ని, సీతారాం, మహేష్, రాధాకృష్ణ, రామకృష్ణ, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

నెల్లిమర్ల టీడీపీలో అంతర్గత పోరు

పూసపాటిరేగ: నెల్లిమర్ల టీడీపీలో అంతర్గత పోరు కొనసాగుతోంది. కూటమి అభ్యర్థిగా మాధవికి టికెట్ కేటాయించి వారాలు గడుస్తున్నా టీడీపీలోని ప్రధానవర్గం దూరంగా ఉంటోంది. విజయనగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో సోమవారం ఏర్పాటుచేసిన అంతర్గత సమావేశానికి సైతం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, ఆయన అనుచరులు వెళ్లలేదు. భీమిలి ఎమ్మెల్యే, లేదంటే విజయనగరం ఎంపీ టికెట్ వస్తుందన్న ఆశతో కర్రోతు వర్గం ఎదురుచూస్తోంది. రెండు స్థానాలపై స్పష్టత వచ్చాక తదుపరి నిర్ణయం తీసుకునే యోచనలో ఉంది. మాధవితో కలిసి పనిచేసేందుకు కొందరు నాయకులు అస్సలు ఇష్టపడడంలేదు. కొందరు డబ్బుకోసం ఆమెతో చేతులు కలుపుతున్నారన్న విమర్శలు పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

ఎన్నికల నియమావళి పాటించాలి



నాతవలసలో మాట్లాడుతున్న భోగాపురం రూరల్ సీఐ వెంకటేశ్వరరావు

డెంకాడ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అందరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పకుండా పాటించాలని, లేకపోతే చర్యలు తప్పవని భోగాపురం రూరల్ సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని సింగవరం, నాతవలస గ్రామాల్లో సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల వేళ లేనిపోని వివాదాల్లో తలదూర్చితే నష్టపోతారన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై కృష్ణమూర్తి, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 28వ తేదీ నుంచి మే నెల 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులైతే రూ.200.. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులైతే రూ.150 రుసుం చెల్లించాలన్నారు. పదో తరగతి మార్కుల ఆధారంగా రిజర్వేషన్ రూల్స్ ఉంటాయని తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన ఉంటుందని పేర్కొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు తగవు

నెల్లిమర్ల రూరల్: శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఏపీ టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే మంచి సంకల్పంతో సీఎం జగనన్న వలంటీర్ వ్యవస్థను ప్రవేశ పెట్టారని.. అటువంటి వారిని టెర్రరిస్టులు అని సంభోదించడం సరికాదన్నారు. తక్షణమే వలంటీర్లకు క్షమాపణలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పూసపాటిరేగ: మండలంలోని పతివాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలలో మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఈఈ జి.సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో చింతపల్లి, పతివాడ, చినపతివాడ, రాయుడుపేట, బర్రిపేట, తమ్మయ్యపాలెం, చౌడువాడ, రోలుచప్పిడి, కోనయ్యపాలెం, కృష్ణాపురం, కొల్లాయివలస, పులిగెడ్డపాలెం గ్రామాలలో సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.